



# ఏవి తల్లీ నిరుడు విరిసిన కథాసుమాలు

**- పద్మశ్రీ బ్రహ్మానందం**

ఆయన కథా రచయిత కాకపోవచ్చు. అయినంత మాత్రాన ఆయనకి కథల గురించి తెలియదనుకోవడం పొరపాటు. ఆయనకి కథల గురించి, జీవన వ్యథల గురించి బాగా తెలుసు. తెలుగు కథ గురించి ఇంకా బాగా తెలుసు. నచ్చిన కథల గురించి...తను మెచ్చిన కథల గురించి ప్రముఖ హాస్య నటుడు పద్మశ్రీ బ్రహ్మానందం అభిప్రాయాలు, సరదా సరదా ముచ్చట్లు ఆయన మాటల్లోనే మీకోసం...



రాష్ట్రపతి చేతులమీదుగా 'పద్మశ్రీ' అందుకుంటూ...

## బ్రహ్మానందంకు నచ్చిన కథ : 1

రూపాయి నోటు తప్ప అంతకు మించి ఖరీదయిన నోటు ఇస్తే తీసుకునే వాడు కాదు ఆ వ్యక్తి. తీసుకోమని వెయ్యి నోటు ఇచ్చినా విసిరేసేవాడు. పిచ్చాడు. డబ్బు విలువ తెలీదు అనుకునే వారంతా. ఆ ఊరికి ఎవరొచ్చినా పిచ్చాణ్ణి పిలిచి–

''చూడండీడు! ఈడు రూపాయి నోటు తప్ప ఇంకో నోటు తీసుకోడు'' అంటూ రూపాయి నోటుతో పాటు అయిదు, పది, యాభై, వంద, అయిదు వందలు, వెయ్యి నోటు ఉంచి–

''తీసుకోరా! నీకే నోటు కావాలంటే ఆ నోటు తీసుకో'' అంటే...పిచ్చాడు రూపాయి నోటు మాత్రమే తీసుకుని పరిగెత్తడాన్ని ఊరికి కొత్తగా వచ్చినవారితో పాటు అక్కడ గుమిగూడిన పది మందీ చూసి నవ్వుకునేవారు. ఒకనాడు ఆ ఊరికి కొత్తగా వచ్చిన ఆసామి పిచ్చాణ్ణి పిలిచి–

''నీకు డబ్బు విలువ తెలీదు అనుకుంటాను. రూపాయి కన్నా వెయ్యి రూపాయలు ఎక్కువ. ఈసారి వెయ్యి రూపాయల నోటు తీసుకో'' చెప్పాడు.

''ఎక్కువ తక్కువలు నాకూ తెలుసు! వెయ్యి నోటు తీసుకుంటే ఆట ఆనాటితో సరి! ఎవరూ నన్ను పిలిచి నోట్లు నా ముందు ఉంచరు. నన్ను పిచ్చాణ్ణి అనుకోరు. రూపాయి నోటు తీసుకుంటేనే సుఖం. రోజుకో పది రూపాయలు కిడతాయి. బతుకు గడిచిపోతుంది'' అన్నాడు పిచ్చాడు. పరిగెత్తిపోయాడు. వాడి మాటలకి ఆశ్చర్యపోయి, తర్వాత 'బతక నేర్చిన వాడు' అనుకున్నాడు ఆసామి.

* కథను తొలిసారిగా ఎప్పుడు విన్నదీ నాకు జ్ఞాపకం లేదుగాని, కథలు మాత్రం మా బామ్మ దగ్గర విన్నాను. ఆవిడ కథలు బాగా చెప్పేది. 'చందమామ కథల'న్న మాట! బలే చెప్పేది. రాకుమారులు, రాకుమార్తెలు, మాంత్రికులు...ఉత్కంఠగా నడిచేవి ఆ కథలు. ఊపిరి బిగబట్టి వినేవాణ్ణి. ఒకొక్కసారి భయపడేవాణ్ణి కూడా. నేనలా భయపడ్డప్పుడు 'ఇవి ఉత్త కథల్రా నాన్నా! భయం దేనికి' అనేది బామ్మ. ధైర్యం చెబుతున్నట్టుగా నన్ను దగ్గరగా తీసుకునేది.


* తొలిసారిగా చదివిన కథంటే...ముళ్ళపూడి వారి 'బుడుగు' మొదటిసారిగా నేను చదివినట్టు గుర్తు. తర్వాత కొంచెం పెద్దయ్యాక కొమ్మూరి సాంబశివరావుగారి డిటెక్టివ్ నవలలు విపరీతంగా చదివాను. చాలా బాగుండేవవి. పిచ్చ టెన్షన్...టెంపో! ఓర్నాయనో...ఒంటరిగా కూర్చుని చదివితే చెమటలు పట్టిపోయేవాణ్ణి. అసలా శైలి...నయాగరా జలపాతంలా ఉండేది. మొదలు పెట్టడం వరకే మన వంతు. పుస్తకాన్ని పూర్తిగా చదివించడం...ఆయనదే...కొమ్మూరి వారిదే బాధ్యతంతా! అలా రాసేవారేరి? ఏదయినా ఆ రోజులే రోజులు! ఆనాటి రచనలే రచనలు!

* అయ్యయ్యో! లేదండి! నాకెప్పుడూ కథలు రాయాలనిపించలేదు. అలా అనిపించకపోవడం తెలుగు పాఠకులు చేసుకున్న గొప్ప అదృష్టంగా నేను భావిస్తున్నాను. అనిపిస్తే ఉండేదీ...అంతే సంగతులు(నవ్వు)

* రచయితలు చాలా మంది నాకు తెలుసు! చాలా మంది నాకు మిత్రులు కూడా. ముళ్ళపూడి, ఆవంత్స సోమసుందర్, చందు సుబ్బారావు, అద్దేపల్లి రామ మోహనరావు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, తనికెళ్ళ భరణి...లిస్టు చాలా పెద్దదే ఉంది. వాళ్ళంటే నాకు చాలా గౌరవం. గుప్పెడు కూడా లేని తెలుగు అక్షరాలతో గంపెడు గంపెడు భావాలను సృజించడం నిజంగా అద్భుతం! పరమాద్భుతం! అందుకే రచయితలను నేను దేవతల్లా చూస్తాను. చేతులెత్తి నమస్కరించకపోవచ్చుగాని, చేయి జాచి చనువుగా వాళ్ళను దగ్గరగా తీసుకోవడం నేను చేసుకున్న అదృష్టంగా భావిస్తాను.

* కథలు...కథకులు ఎలా ఉండాలంటే...కథల్లో సామాజిక స్పృహ ఉండాలి. కథకునికి నిజాయితీ ఉండాలి. మనిషిలో పశు ప్రవృత్తిని తొలగించేది కథ. అలాంటి కథలు రాయగలగాలి. ఆర్ద్రత...ఆర్ద్రత ఉండాలి. నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళేనని...కథ విషాదాంతం అయినా సుఖాంతం అయినా కళ్ళు చెమర్చగలగాలి. గుండె గూడు పట్లు జారిపోవాలి. కథలు అలా ఉండాలి.

* చాలా కథలు చదివాను. చదవడం అలవాటు చేసుకోమని మా నాన్నగారంటే అలవాటు



అమితాబ్‌తో ... బ్రహ్మానందం

చేసుకుని దొరికిన ప్రతి కథా చదివాను. చెహోవ్‌ని చదివాను. గోర్కీని చదివాను. మల్లాది రామకృష్ణ శాస్త్రి , శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి , బుచ్చిబాబు, చలం...అందర్నీ చదువుకున్నాను. చదివిన కారణంగానే నేనిలా ఉన్నాను. సంస్కారాన్ని పెంచుకోవాలంటే కథలు చదవాలి. నేను కథలు చదివే నా సంస్కారాన్ని పెంచుకున్నాను. సున్నం ఆంజనేయులు అని మా గురువుగారు-

"కథలంటే కథలు కావవి! అవన్నీ నిజాలే! నిజాలు తెలుసుకోవడం ఎంతైనా అవసరం. అందుకుని కథలు చదవండి! బాగుపడతారు" అనేవారు. ఆయన మాటల్ని నాలాంటి వాళ్ళు చాలా మంది చెవిన పెట్టి బాగుపడ్డాం.

* కథల్లో ఏం వెతుకుతానంటే... ముందుగా నేను చదువుతున్న కథలో కథకు కావాల్సిన లక్షణాలు ఉన్నాయో

"కథలంటే కథలు కావవి! అవన్నీ నిజాలే! నిజాలు తెలుసుకోవడం ఎంతైనా అవసరం. అందుకుని కథలు చదవండి! బాగుపడతారు" అనేవారు. ఆయన మాటల్ని నాలాంటి వాళ్ళు చాలా మంది చెవిన పెట్టి బాగుపడ్డాం.

లేదో వెతుకుతాను. తర్వాత ఇందులో 'మెసేజ్' ఏం ఉందని వెతుకుతాను. ఆ తర్వాత ఇది మంచిని పెంచుతోందా? చెడును ప్రోత్సహిస్తోందా? అన్నది తేల్చుకుంటాను. బియ్యంలో రాళ్ళు ఏరుతున్నట్టుగా ఒకదాని తర్వాత ఒకటిగా ఇవన్నీ చేస్తూ కూర్చోను. అన్నీ వాటంతటవే అప్రయత్నంగా జరుగుతాయి. ఇన్నెందుగ్గాని...జీవితాన్ని ఈ కథా రచయిత స్పృశిస్తున్నాడా? లేదా? ఈ కథలో జీవితం ఉందా? లేదా? అని ఆలోచించాలోచించి కథ బాగుంటే 'భేష్' అనుకుంటాను. బాగులేకపోతే 'ఏంటీ కథ ఇలా ఉంది' అని బాధపడి, టైం వేస్ట్ చేసుకున్నందుకు నన్ను నేను తిట్టుకుంటాను.

* సమాజానికి కథలు కావాలి. వాటి అవసరం సమాజానికి చాలా ఉంది. పంచతంత్రం కథలు, అరేబియన్ నైట్స్, జాతక కథలు...ఇంకా అనేక కథలు ఉండబట్టే...వాటిని మనం చదుకోబట్టే ఎంతో కొంత విజ్ఞానాన్ని , విజ్ఞానంతో పాటు సంస్కారాన్ని పొందగలిగి ఈ తీరులో ఉన్నాం. లేకపోతే ఏ రకంగా ఉండే వాళ్ళమో ఊహించలేం.

* నేటి తరానికి పఠనాసక్తి అవసరమా? అంటే...అవసరమే! చదవకోకపోతే ఎలాసార్! చదువుకోకపోవడం, నేర్చుకోకపోవడం భరించలేనివి. గొంగళి పురుగు దశ నుండి మనిషి సీతాకోక చిలుక కావాలంటే...ఆ పరిణామన్ని అందుకోవాలంటే...చదవాలి. ఎంత చదివితే అంత మంచిది! విద్యలేని వాడు వింత పశువు సార్! ఆ పశుత్వాన్ని తట్టుకోలేం.

* నన్ను మన్నిస్తే నేనో నిజం చెబుతాను. ఈ మధ్య కాలంలో తెలుగులో మంచి కథలు రావట్లేదు. వస్తున్నా...నా వయసు రీత్యా, నా అనుభవం రీత్యా అవి నాకు నచ్చట్లేదేమో! ఏదేమైనా నన్ను కదిలించే కథలు ఇటీవల నాకు కరవైపోయాయి. అమరావతి కథల్లాంటి కథలు ఏవి మళ్ళీ? ఎక్కడున్నాయి. రాసేవాళ్ళు రాస్తున్నారు. కాని ఏవీ నిలబడట్లేదు. రావాలి సార్! మంచి కథలు, మనిషిని ఆలోచింపజేసే కథలు, మనిషిని తట్టిలేపే కథలు, గుండె లోతుల్ని స్పృశించే కథలు రావాల్సిన అవసరం చాలా ఉంది.

* ఆఖరిగా కథలు చెప్పడం మాటలు చెప్పినంత సులభం కాదు. ఆ సంగతి అలా ఉంచితే మా శ్రీమతికి నేనెప్పుడూ కథలు చెప్పలేదు. ఒక వేళ చెప్పినా నిజాలే చెప్పాను. అబద్ధాలు చెప్పలేదు. నా పిల్లలకంటారా? మంచి కథలు చాలా చెప్పేను. ఇప్పటికీ చెబుతూనే ఉంటాను. పిల్లలకి ఎంత ఆస్తి ఇచ్చామన్నది కాదు ప్రధానం. ఎంతగా చదివించామన్నది ప్రధానం. నేనెప్పుడూ ఇదే ఆలోచనలో ఉంటాను. పదిమందికీ ఇదే మాట చెబుతాను.

**-జె.ఎస్.**

## బ్రహ్మానందంకు నచ్చిన కథ : 2

జాలి, కరుణ, దయ, సానుభూతి, ప్రేమకు ప్రతిరూపమైన వ్యక్తినీ, హింస, క్రూరత్వం దుర్మార్గం, రాక్షత్వం కరుడు గట్టిన వ్యక్తిని...ఇద్దరినీ చిత్రించాలనుకున్నాడు ఓ చిత్రకారుడు. తన రెండు చిత్రాలకు ప్రపంచంలో తిరుగుండకూడదనుకున్నాడు. అదే పనిగా శోధించి శోధించి ఓ బాలుణ్ణి చూసి-

'బాగున్నాడు. ఈ బాబే ప్రేమకి ప్రతిరూపం' అనుకుని, విషయం వివరించి ఆ బాలుని అనుమతితో అతన్ని అద్భుతంగా చిత్రించాడు. కొన్నేళ్లు గడిచిపోయాయి. ప్రేమకి ప్రతిరూపాన్ని చిత్రించడం జరిగింది కాని, కరుడుగట్టిన రాక్షసత్వాన్ని చిత్రించడం ఇన్నేళ్ళలోనూ జరగలేదు. ఎలా ఎలా అనుకుంటుండగా నరరూప రాక్షసుడు ఉన్నాడని తెలిసింది. వెళ్ళి అతన్ని చిత్రించాడు. తను గీసిన బొమ్మను చూసి తనే భయపడ్డాడు చిత్రకారుడు. అతనలా భయపడడాన్ని చూసి-

"అంత భయంగా ఉన్నానా" అనడిగి,

"గుర్తు చేసుకో! ఒకప్పుడు ప్రేమకి ప్రతి రూపం కూడా నన్ను చూసే నువ్వు గీశావు" అన్నాడు ఆ నర రూప రాక్షసుడు. ఆ మాటకి చిత్రకారుడు అవాక్కయ్యాడు.



మేమిద్దరం.. మాకిద్దరు...

**బ్రహ్మానందానికి బాగా నచ్చిన కథ**

# తులసి తాంబూలం

- సత్యం శంకరమంచి

వర్షం విడవకుండా కురుస్తోంది.

ఆకాశంలోని మేఘాలన్నీ అమరావతిని చుట్టుముట్టాయి. జోరున, భోరున కురుస్తున్న ఆ వర్షంలో మూడో ప్రాకారం మంటపంలోని వామనాచార్లు తదేకంగా పెద్దబజారు వైపు చూస్తున్నాడు. కళ్ళు విచ్చుకు గాలిస్తున్నాడు మనిషి కోసం. పెద్ద బజారంతా జలమయంగా ఉంది తప్ప జన సంచారం లేదు. అప్పుడే పదకొండు గంటలు దాటింది. ఇంతవరకూ ఒక్క యాత్రికుడు రాలేదు. ఎవరో యాత్రికుడు రావాలి. అతగాడు అర్చన చేయించుకోవాలి. తనకో రూపాయి ఇవ్వాలి. ఆ రూపాయితో బియ్యం తెచ్చి వండితేనే స్వామికి నివేదనా, వామనయ్య దంపతులకు భోజనమున్నూ, వామనా చార్లు భార్య తాయారమ్మ కిందటి రాత్రే ఇన్ని అటుకులు, బెల్లం ఉడికించి విస్తట్లో వడ్డించి "ఈ పూటతో అటుకులయి పోయాయి" అంది. బియ్యం నిండుకున్నాయి సరేసరి, రేపటికి అటుకులు కూడా లేవని అర్థమయింది వామనాచార్లుకి.

అందుకే ఉదయం నుంచి యాత్రికుల కోసం ఎదురు చూస్తున్నాడు. వర్షం తగ్గేట్టు లేదు. "ఇంత తుపానులో భక్తులెవరొస్తారు?" వామనాచార్లు ఆశగా పెద్దబజారు వంకే చూస్తున్నాడు. దూరంగా రెండు గొడుగులు - ఆచార్లు కళ్ళల్లో ఆశ, "కూర లేకపోతే ఫర్వాలేదు పచ్చడేసుకు తినొచ్చు!" గొడుగులు స్పష్టంగా కన్పిస్తున్నాయి. "అమ్మ! ఒకళ్ళు కాదు ఇద్దరు! రెండు రూపాయలు దొరికితే ఇవాళ్టికే కాదు, రేపటి గురించిన చింతకూడా ఉండదు" గొడుగులు ఇంకా ముందుకొచ్చి చటుక్కున ఇళ్ళలోకి దూరిపోయాయి. వాళ్ళు యాత్రికులు కాదు. వామనాచార్లు కుంగిపోయి చతికిల పడ్డాడు.

పన్నెండు దాటుతోంది. వామానాచార్లకి ఆశ సన్నగిల్లుతోంది. నీరసం వస్తోంది. "వేణుగోపాలా! నీకు ఇంత వర్షంలో గన్నేరు పూలు తీసుకొచ్చి పూజ చేశానే! మందారమాల అల్లి మెళ్లో వేశానే! దానికి ఫలం నాకు పస్తా?" అనుకొన్నాడు. అంతలో పెద్దబజారు చివర్న ఒక గొడుగు, వామనా చార్లు కళ్ళు ఆశగా చూశాయి. గొడుగు మరీ దగ్గరకొస్తోంది. చేతిలో సంచి, తప్పకుండా యాత్రికుడే! గొడుగు గాలిగోపురం దగ్గర కొచ్చింది. అంత వర్షాన్ని లెక్క చెయ్యకుండా వామనాచార్లు మెట్లు దిగి రయ్యిన పరుగెత్తుకొచ్చాడు.

ఆ యాత్రికుడు కొబ్బరికాయలు కొంటుంటే "అయ్య వారి గుళ్ళో ఒకటి, అమ్మవారి గుళ్ళో ఒకటి, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికొక్కడా ఇంకో కొబ్బరికాయ తీసుకోండయ్యా" అన్నాడు.

ఆ యాత్రికుడు రెండు కొబ్బరి కాయలు, పళ్ళూ తీసుకొని ముందుకు నడుస్తుంటే అతని వెనకాలే "క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి పై ప్రాకారంలో నండయ్యా" అంటున్నాడు వామనయ్య. ఆ యాత్రికుడు ప్రదక్షిణం చేస్తుంటే వెంటవెంటనే అంటి పెట్టుకు తిరుగుతూ "క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి గుడి ఇదేనండయ్యా" అన్నాడు. "పెద్ద గుళ్ళోకి వెళ్ళి రానివ్వండి" అని ఆ యాత్రికుడు అమరేశ్వరుడి దగ్గరకి వెళ్ళినా వామనయ్య అతన్ని వదల్లేదు. అయ్యవారి గుళ్ళో పూజయ్యే దాకా పక్కనే ఉన్నాడు.

రెండు కొబ్బరి కాయలు అక్కడే కొట్టేశాడు అయ్యవారి గుళ్ళో అర్చకుడు. మిగిలిన రెండు



## నాకు ఈ కథ ఎందుకు నచ్చిందంటే...

బాధని, పేదరికాన్ని ప్రధాన వస్తువుగా తీసుకుని చాలా మంది కథలు రాశారు. అయితే ఆ కథలేవీ నన్ను కదిలించలేకపోయాయి. కళ్ళను చెమరించలేకపోయాయి. తప్పు ఆ కథలది కాదేమో! నాదేనేమో...అనుకుంటున్న రోజుల్లో 'అమరావతి కథలు' శీర్షికన ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురణ అయిన 'తులసి తాంబూలం' కథ చదివాను. కథలోని వర్షం నా కళ్ళలో కురిసింది. ఎందుకు ఏడ్చానో ఏకబిగిన ఓ పావుగంటపాటు ఏడ్చాను. ఏడ్చేడ్చి కాస్సేపటికి తేరుకున్నాను. గొప్పకథ అంటే ఇది! ఇలా ఉంటుంది అనుకున్నాను. అప్రయత్నంగా పెరటిలోనికి నడిచాను. అక్కడి కోటలోని తులసి చెట్టుని ప్రేమగా నిమిరి దాని ఆకులు రెండు తెంచి కళ్ళ కద్దుకుని నోటిలో వేసుకున్నాను. ఏంటో వెర్రి ఆనందం! నా చర్యలకు, చదివిన కథకు సంబంధం ఉందా? అంటే ఉంది! లేదు అంటే లేదు. ఒకటి మాత్రం నిజం! గొప్ప కథలు మనిషిని స్థిరంగా ఉండనీయవు.

- బ్రహ్మానందం

పళ్ళూ అమ్మవారి గుళ్ళో ఇచ్చాడు యాత్రికుడు. నివేదనకు లేకపోతే లేక పోయింది. ''క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామికి కొంచెం కర్పూరం ఉంచండయ్య'' అని వామనయ్య వేడుకోగా కొంచెం కర్పూరం మిగిల్చాడు యాత్రికుడు. అక్కడ పూజ కాగానే ''క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి గుడి ఇటు రండయ్యా'' అని దోవ చూపిస్తూ వేణుగోపాలస్వామి గుళ్ళోకి తీసుకొచ్చాడు యాత్రికుణ్ని.


'అర్చన చేస్తా'నన్నాడు వామనయ్య.

'వొద్ద'న్నాడు యాత్రికుడు.

'పోనీ మంత్రపుష్పం...'' అన్నాడు వామనయ్య.

''అక్కర్లేదు హారతివ్వండి'' అన్నాడు యాత్రికుడు.

అయినా సరే గోత్ర నామాలతో అర్చనచేసి మహాభక్తితో హారతిచ్చాడు వామనయ్య. ఆ యాత్రికుడు సంతోషించి అర్ధరూపాయి పాదుకల పళ్ళెంలో వేశాడు. ''పోన్లే! ఒక పూట ముద్దపెట్టాడు స్వామి'' అని తృప్తిపడుతున్న వామనయ్యకి పెద్ద గుళ్ళో గంట మోగటం విన్పించింది. ఇంకో యాత్రికుడేమోనని ఆశపడ్డాడు వామనయ్య. ఇంతలో ''వానయ్యేది వరదయ్యేది దేవుణ్ణి చూడకుండా భోంచెయ్యనుగా!'' అన్న చిల్లర కొట్టు సుబ్బయ్య గొంతు విన్పించింది.



వేణుగోపాల స్వామి గుళ్ళో కొస్తూనే ''స్వామీ'' అని గంట మోగించి చేతులు జోడించి నిలబడ్డాడు సుబ్బయ్య. వామనయ్య పాదుకల పళ్ళెం తీసుకొచ్చి పాదుకలు సుబ్బయ్య తలమీద పెట్టడంతో పళ్ళెంలో అర్ధరూపాయి తళుక్కున మెరిసింది. తులసీదళం కోసం చేయి జాపవలసిన సుబ్బయ్య చటుక్కున ఆ అర్ధ రూపాయి లాక్కుని బొడ్లో దోపుకుని బాకీలో జమేసుకుంటానని వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాడు. వామనయ్య వూరందరిలాగే ఉప్పూ, పప్పూ సుబ్బయ్య దగ్గర అప్పు తెచ్చుకుంటాడు.

వామనయ్య తెల్లబోయాడు. దిమ్మరపోయి తూలి పడబోయి ద్వారపాలకుడి పక్కనే చతికిల పడ్డాడు. కొంతసేపటికి పెద్ద గుళ్ళో నైవేద్యాలు జరుగుతున్న గంటలు విన్పిస్తే, అందులో ఓ అర్చకుణ్ణి పిలిచి ''ఇవాళ మా ఇంట్లో ఇబ్బందయింది. వేణుగోపాలస్వామి గుళ్ళో కూడా నివేదన పెట్టమ''ని అడిగాడు. అతగాడు నివేదన పూర్తిచేసి వెళ్ళినా వామనయ్య అక్కణ్నించి కదల్లేదు.

కొంతసేపటికి ఆగని ఆ వర్షంలోనే తడుస్తూ, నీరసంగా ఇంటికొచ్చాడు. తాయారమ్మా తులసి పూజ చేసుకుని ఇంట్లో కొస్తోంది. భర్త చేతిలోనూ ఏమీలేదు. చెంగునా ఏమీ లేదు. పీట వాల్చుక్కూర్చోవలసినాయన మంచం వాల్చుకోవటంతో అర్థమయిందామెకు. వామనయ్య దగ్గర కొచ్చి తీర్థం ఇచ్చి నాలుగు తులసిదళాలు వామనయ్య చేతిలో పెట్టింది. చెవుల్లో పెట్టుకోవలసిన తులసిదళాలు వామనయ్య నోట్లో వేసుకుని నమలటం మొదలెట్టాడు. ఎదురుగా స్తంభాని కానుక్కూర్చుని తాయారమ్మ కూడా తులసిదళాలు నములుతోంది. వాళ్ళు దళాలు ఎలా నములు తున్నారంటే సుష్టుగా పిండి వంటలతో భోంచేసి తృప్తిగా తాంబూలం నమిలినట్టు నములు తున్నారు.

అలా నములుతూ ఒకళ్ళని చూసి ఒకళ్ళు నవ్వుకున్నారు. వామనయ్య 'గోపాలా' అంటే తాయారమ్మ 'వేణుగోపాలా' అంది. తులసిదళాలు నమలగా నమలగా వాళ్ళ నోళ్ళు పండాయి.

☆